# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 06-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (HPCL) విశాఖపట్నం రిఫైనరీలో రెసిడ్యూ అప్‌గ్రేడేషన్ ఫెసిలిటీ (RUF)ని విజయవంతంగా ప్రారంభించడాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు.
- ❖ భారత్ లో వచ్చే నెలలో గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ను నిర్వహించనున్నట్టు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.
- ❖ పోషకాహార లోపాన్ని పరిష్కరించడంలో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ముఖ్య పాత్రను పోషిస్తుందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ తెలిపారు.
- ❖ దేశ భాషలపై భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

=====================

హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (HPCL) ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నం రిఫైనరీలో రెసిడ్యూ అప్‌గ్రేడేషన్ ఫెసిలిటీ (RUF)ని విజయవంతంగా ప్రారంభించబడటం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఇంధన భద్రత, స్వావలంబన వైపు భారత్ ప్రయాణంలో ఇది ఒక నిర్ణయాత్మక ముందడుగు అని ఆయన అభివర్ణించారు. ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా.. ఇంధన స్వాతంత్ర్యాన్ని పెంపొందించడానికి దేశం చేస్తున్న ప్రయత్నాలకు ఈ అత్యాధునిక సౌకర్యం ఊతం ఇస్తుందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

=====================

భారత్ లో గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ను వచ్చే నెలలో నిర్వహించనున్నట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. రాజస్థాన్ లోని జైపూర్‌లో ఈరోజు జరిగిన రీజనల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026లో ఆయన వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. గతంలో UK, దక్షిణ కొరియా, ఫ్రాన్స్ దేశాలలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్

లు జరిగాయని.. ఈసారి భారతదేశంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్లోబల్ ఏఐ సమ్మిట్ సన్నాహాల్లో భాగంగా.. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ప్రాంతీయ ఏఐ సమ్మిట్‌లు జరుగుతున్నాయని ఆయన తెలియజేశారు. వచ్చే ఏడాదిలోగా 10 లక్షల మంది యువకులు, చిన్న వ్యవస్థాపకులు ఏఐ నైపుణ్యాలను పొందుతారని చెప్పారు. ఇండియా AIలో సుమారు 70 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఉండే అవకాశం ఉందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. ఈ మిషన్‌లో అనేక కొత్త ప్రయోగాలు, అప్లికేషన్లు, నూతన సాంకేతిక అభివృద్ధి ప్రాజెక్టులు ఉన్నాయని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ చారిత్రక, సాంస్కృతిక, సాహిత్య సంపదను కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. న్యూఢిల్లీలో శాస్త్రీయ భారతీయ భాషలలో 55 సాహిత్య రచనలను కేంద్రమంత్రి ఈరోజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ... భారతదేశం అపారమైన భాషా వైవిధ్యం కలిగిన దేశమని, దేశ భాషలపై భవిష్యత్ తరాలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం అన్ని భారతీయ భాషలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. జాతీయ విద్యా విధానం-2020 భారతీయ భాషలలో విద్యా దృక్పథాన్ని ముందుకు తీసుకువెళుతుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఉపాధి కల్పన, సామాజిక శ్రేయస్సుకు తోడ్పాటును అందించే శాస్త్రీయ కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేయాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో జితేంద్ర సింగ్ అధ్యక్షతన ఈరోజు జరిగిన కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (CSIR) ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ... క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ప్రయోజనాలను అందించే ప్రయోగశాల ఆధారిత ఆవిష్కరణపై దృష్టి సారించాలన్నారు. శాస్త్రీయ పరిశోధనలు ఉద్యోగాలు, స్టార్టప్‌లు, సామాజిక ప్రయోజనంగా మారాలని మంత్రి స్పష్టం చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యాపార సౌలభ్యానికి మద్దతు ఇస్తూనే దేశంలో నాణ్యతా ప్రమాణాలను బలోపేతం చేయడంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంస్థ (BIS) కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన బిఐఎస్ 79వ వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... వ్యవసాయం, తయారీ, సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాలలో విశ్వాసానికి చిహ్నంగా బిఐఎస్ హాల్‌మార్క్ ఉద్భవించిందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ సామాజిక, ఆర్థిక భద్రతకు పోషకాహార లోపాన్ని నివారించడం ఎంతో అవసరమని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ నిర్వహించిన పోషకాహారంపై CSR కాన్ క్లేవ్‌లో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... పోషకాహారలోపం అనేది ది వికసిత్ భారత్ నిర్మాణానికి పెద్ద అడ్డంకి అని పేర్కొన్నారు. పోషకాహార లోపానికి గల కారణాలను పరిష్కరించడంలో మహిళా, శిశు అభివృద్ధి

మంత్రిత్వ శాఖ ముఖ్య పాత్రను పోషిస్తుందన్నారు. గర్భిణీ స్త్రీలు, పిల్లల్లు పోషకాహారం తీసుకోవడంతో ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో భాగంగా ఎన్నికల సంఘం ఉత్తరప్రదేశ్ ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసింది. లక్నోలో ఈ రోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా మీడియాకు వివరాలు తెలియజేస్తూ... ఓటర్ల జాబితాలో 12 కోట్ల 55 లక్షల 56 వేల 25 మంది ఓటర్ల పేర్లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలో 81.30 శాతం మంది ఓటర్లు కొత్త ముసాయిదా ఓటర్ల జాబితా కోసం తమ పేర్లను నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన కొత్త ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 2.89 కోట్ల మంది ఓటర్ల పేర్లు నమోదు కాలేదని, ఇది ప్రస్తుత ఓటర్ల జాబితాలో 18.70 శాతంగా ఉందని తెలిపారు. ఉత్తరప్రదేశ్ ఓటర్ల తుది జాబితా వచ్చే మార్చి 6న విడుదల కానుంది.

======================

మదురైలోని తిరుపరంకుండ్రం కొండపై ఉన్న రాతి స్తంభం వద్ద కార్తీక దీపాన్ని వెలిగించేందుకు అనుమతిస్తూ.. మద్రాస్ హైకోర్టు తీర్పు వెలువరించింది. గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూ.. జస్టిస్ జి. జయచంద్రన్, జస్టిస్ కె.కె. రామకృష్ణన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈరోజు కీలక ఆదేశాలు జారీ చేసింది. తమిళనాడు డీఎంకే ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు, దర్గా కమిటీ గతంలో దాఖలు చేసిన అప్పీళ్లను కోర్టు తోసిపుచ్చింది. కార్తీక దీపం వెలిగించేందుకు చట్టపరమైన అడ్డంకులు ఏవీ లేవని స్పష్టం చేసింది. దీపం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలను ధర్మాసనం తిరస్కరించింది. ఈ దీపస్తంభం సుబ్రమణ్యస్వామి ఆలయానికి చెందినదే అని న్యాయస్థానం తెలిపింది.

======================

దేశంలోని పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కారణంగా  పలు రైలు సర్వీసులకు అంతరాయం ఏర్పడి, అనేక రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగింది.  తక్కువ దృశ్యగోచరత పరిస్థితుల వల్ల 70కి పైగా ఢిల్లీ వెళ్లే రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయని భారతీయ రైల్వే పేర్కొంది. అసౌకర్యం, జాప్యాలను నివారించడానికి ప్రయాణికులు స్టేషన్‌కు చేరుకునే ముందు తమ రైళ్ల తాజా స్థితిని తనిఖీ చేసుకోవాలని సూచించారు.

======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 439 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమై... చివరికి 376 పాయింట్ల నష్టంతో 85 వేల 063 వద్ద స్థిరపడింది.

======================

======================